సాక్షి
ప్రకాశం

ఆదివారం । 5 । మే । 2024



నిజాయితీ ఉంటే రాజీనామా చేయాలి

వైఎస్సార్‌ సీపీ నుంచి టీడీపీకి అమ్ముడుపోయి ఆ పార్టీలో చేరిన కార్పొరేటర్లు నిజాయితీ ఉంటే వెంటనే రాజీనామా చేసి పోటీ చేసి గెలవాలని మేయర్‌ గంగాడ అన్నారు.

- 8లో..



స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటేయాలి

ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయాలని ఎన్నికల జిల్లా పోలీస్‌ అబ్జర్వర్‌ హసీబ్‌ ఉర్‌ రెహమాన్‌ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
44/29

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్‌

చంద్రబాబు కుట్రకు పండుటాకు బలి

మృతి చెందిన సామ్రాజ్యం

మార్కాపురం: పింఛను కోసం రెండు రోజుల నుంచి బ్యాంకుల చుట్టూ తిరిగి వడదెబ్బకు గురై వృద్ధురాలు మరణించిన సంఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని నాగేళ్లముడుపు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బి.సామ్రాజ్యం (70) పింఛన్‌ కోసం రెండు రోజుల నుంచి మార్కాపురం పట్టణానికి వచ్చి బ్యాంకుల వద్దకు వెళ్లి తన పింఛను పడిందో లేదోననే ఆందోళనతో తిరుగుతోంది. చాలా మంది వృద్ధుల బ్యాంకు అకౌంట్లకు ఆధార్, పాన్‌ కార్డు అనుసంధానం కాకపోవడంతో డబ్బులు జమ కాలేదు. దీంతో ఈనెల పింఛను డబ్బులు రావన్న ఆందోళనతో శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చి దిగాలుగా కూర్చుంది. ఎండ తీవ్రతకు వడ దెబ్బ తగలడంతో అస్వస్థతకు గురైంది. శనివారం ఇంట్లోనే మృతి చెందింది.

తొలిరోజు పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ ప్రశాంతం

ఒంగోలు అర్బన్‌: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగుల పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ శనివారం ప్రారంభమై తొలిరోజు ప్రశాతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం పోలింగ్‌ విధుల్లో ఉండే ఉద్యోగులు 21,562 మందికి పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లు ఉన్నాయి. వీరితో పాటు 1355 మంది అత్యవసర విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్‌ బ్యాలెట్‌లు ఉన్నాయి. మరో 2865 మంది ఉద్యోగులు ఇతర జిల్లాలో ఓట్లు ఉండి ప్రకాశం జిల్లాలో విధులు నిర్వహిస్తూ పోస్టల్‌ బ్యాలెట్‌ పొంది ఉన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్ర 6 గంటల వరకు నియోజకవర్గాల్లోని ఆయా పోస్టల్‌ బ్యాలెట్‌ కేంద్రాల్లో ఓటింగ్‌ నిర్వహించారు. తొలిరోజు పీవో, ఏపీవోలుగా ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు ఓటు అవకాశం కల్పించారు.

పచ్చ కుతంత్రం

అమ్మా పెట్టదు... అడుక్కోనివ్వదు అన్నట్లు ఉంది చంద్రబాబు అండ్‌ కో, పచ్చ మీడియా పరిస్థితి. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం ప్రజల భూములకు శాశ్వత భూహక్కు కల్పించి పక్కా రికార్డులు తయారు చేస్తుంటే చంద్రబాబు భజన బృందం అక్కసు వెళ్లగక్కుతోంది. ల్యాండ్‌ టైటిలింగ్‌ యాక్ట్, భూముల రీసర్వేపై విష ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోంది.

వాస్తవానికి టీడీపీ జమానాలో రాష్ట్రంలో ఏకంగా 25 లక్షల ఎకరాల భూములను 22(ఏ) జాబితాలో చేర్చడంతో.. పక్కా రికార్డులున్న భూముల రైతులు నానా తిప్పలు పడ్డారు. అవసరమైన సమయంలో భూములు విక్రయించలేక అప్పులు చేయాల్సి వచ్చింది. ఈ తరుణంలో అధికారం చేపట్టిన సీఎం వైఎస్‌ జగన్‌.. 22(ఏ) జాబితా నుంచి లక్షలాది ఎకరాల భూములను తొలగించారు. వందేళ్ల తర్వాత అధునాతన సాంకేతికతతో భూముల రీ సర్వేకు శ్రీకారం చుట్టి దేశమంతా ఏపీ వైపు చూసేలా చేశారు.

అయితే.. భూ సర్వే ప్రక్రియపై తొలి నుంచీ విష ప్రచారం చేస్తున్న పచ్చ విష నాగులు ఎన్నికల వేళ మళ్లీ బుసకొడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నీతి ఆయోగ్‌ సిఫార్సు చేసిన ల్యాండ్‌ టైటిలింగ్‌ యాక్ట్‌ను భ్రష్టు పట్టించి, ప్రజల్ని ఆందోళనకు గురిచేసేలా తప్పుడు ప్రచారానికి దిగిన చంద్రబాబుకు తోడుగా రాజగురివింద పేజీలకు పేజీలు అబద్ధాలు అచ్చేసి విషం చిమ్ముతున్నారు.







- ఎన్నికల్లో ఓటమి భయంతో దుష్ప్రచారం
- టీడీపీ హామీలు జనం నమ్మడం లేదని భూముల పేరుతో 'నారా' కుట్ర
- కేంద్రం తెచ్చిన ల్యాండ్‌ టైటిలింగ్‌ యాక్ట్‌పై పచ్చ మూకల విష ప్రచారం
- రాష్ట్రంలో వందేళ్ల తర్వాత చేపట్టిన భూముల రీ సర్వేపైనా అదే విషం
- మూడో దశ రీ సర్వే జరుగుతుండగా ప్రజలకు అడ్డగోలుగా ఐవీఆర్‌ఎస్‌ కాల్స్‌
- బాబును గద్దెనెక్కించాలని రాజగురివింద, తోక పత్రికల బరితెగింపు రాతలు
- ప్రజలను అభద్రతలోకి నెట్టి ఎన్నికల్లో గెలవాలనే పచ్చ ముఠా రచ్చ

ఒంగోలు అర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్‌ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు భూములు పదిలం అవుతున్నాయి. ప్రభుత్వం చేపట్టిన స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వస్తున్న దరఖాస్తుల్లో భూ సమస్యలకు సంబంధించినవే ఎక్కువగా ఉంటున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో జరిగిన తప్పిదాలతో భూ సమస్యలు పెరగడంతో ప్రభుత్వం రీ సర్వేకు నిర్ణయం తీసుకుంది. దీంతో దాదాపుగా భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. రీ సర్వే కోసం సర్వే ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం (హైబ్రీడ్‌ టెక్నాలజీ)తో ఖచ్చితమైన రేఖాంశాలు, అక్షాంశాలు గుర్తించి హద్దులు నిర్ణయిస్తున్నారు. దీంతో గ్రామాల సరిహద్దుల నుంచి నివాస ప్రాంతాల ఇళ్లు, ఖాళీ స్థలాల వరకు మొత్తం ఇమేజ్‌లతో పాటు హద్దులు పక్కాగా నిర్ణయిస్తున్నారు.

రెండు దశలు పూర్తి..

జిల్లాలో చేపట్టిన రీ సర్వే రెండు విడతల్లో మొత్తం 166 గ్రామాల్లో పూర్తయింది. మొదటి దశలో 33 మండలాల్లోని 45 గ్రామాల్లో మొత్తం 37,651.28 ఎకరాల విస్తీర్ణం, రెండో దశలో 32 మండలాల్లోని 121 గ్రామాల్లో 1,80,882.94 ఎకరాలకు సంబంధించి రీ సర్వే పూర్తి చేశారు. గత ఏడాది సెప్టెంబర్‌ నుంచి మూడో విడతలో 33 మండలాల్లోని 132 గ్రామాలు లక్ష్యంగా రీ సర్వేను వేగవంతం చేశారు. దాదాపుగా పూర్తి కావస్తోంది.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ద్వారా జిల్లా మొత్తం కవర్‌ అయ్యేలా 5 బేస్‌ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో బేస్‌ స్టేషన్‌ సుమారు 35 కిలోమీటర్ల పరిధి వరకు సిగ్నల్స్‌ తీసుకుంటుంది. దీంతో 5 బేస్‌ స్టేషన్‌ల ద్వారా జిల్లా మొత్తం కవర్‌ కానుంది. జిల్లాలో కనిగిరి, ముండ్లమూరు, కొమరోలు, కంభం, యర్రగొండపాలెం ప్రాంతాల్లో బేస్‌ స్టేషన్లను ఏర్పాటు చేశారు. రీ సర్వేలో 158 రోవర్లను వినియోగిస్తున్నారు. ఈ రీ సర్వేలో సర్వే ఆఫ్‌ ఇండియా, గ్లోబల్‌ పొజిషన్‌ సిస్టమ్, డ్రోన్‌ టీమ్, హై ప్రిసస్‌ లెవలింగ్‌ బృందాలతో పాటు 546 మంది మండల, గ్రామ సర్వేయర్లు పనిచేస్తున్నారు.

రీ సర్వేతో ఉపయోగాలు ఇవీ...

వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న రీ సర్వేతో వందేళ్లు ఉన్న సరిహద్దు సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. అంతేకాకుండా రైతులకు ఉచితంగా సర్వే చేయడంతో పాటు హద్దు రాళ్లు పాతి భూ హక్కు పత్రాలు అందజేస్తున్నారు. కుటుంబ సభ్యుల మధ్య ఉన్న భాగాల సమస్యలకు రీ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తోంది. పట్టాదారు వెబ్‌ల్యాండ్‌లో పేరు నమోదు కాని వారికి, పేరు మార్పు అవసరం ఉన్న వారికి రీ సర్వే అనంతరం మ్యుటేషన్‌ చేస్తున్నారు. రిజిస్టర్‌ డాక్యుమెంట్‌ లేకుండా అగ్రిమెంట్‌తో ఉన్న సాదా బైనామా భూముల రైతులకు రీ సర్వేతో భూ హక్కు పత్రాలు అందజేయడంతోపాటు ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేస్తారు. రాష్ట్రంలో తొలిసారిగా గ్రామకంఠంలోని ఇళ్లు, ఖాళీ స్థలాలను సర్వే చేసి ప్రాపర్టీ కార్డులు అందజేస్తున్నారు.

- మీ భూములకు శాశ్వత భూహక్కు
- యాజమాన్య హక్కులకే "టైటిల్‌ యాక్ట్‌"
- రెండో పాస్‌బుక్‌ 'టైటిల్‌ డీడ్‌' కంటే ఆస్తి భద్రతా చట్టం
- చంద్రబాబు అయినా సరే అమలు చేయక తప్పనిసరి

సర్వే చేసే భూముల వివరాలు ఇవీ...

ఉమ్మడి జిల్లాలో సుమారు 33 లక్షల ఎకరాల పైగా విస్తీర్ణంలో రీసర్వే చేయనున్నారు.

- జిల్లా వ్యాప్తంగా పట్టా భూములు 22,96,008.53 ఎకరాలు, ప్రభుత్వ భూములు 9,51,561.95 ఎకరాలు ఉన్నాయి. వీటితో పాటు సర్వే నంబర్లు ఉన్న అటవీ భూములు 81,919.10 ఎకరాలు, సర్వే నంబర్‌ లేని అటవీ భూములు 12,874.10 ఎకరాలతో కలిపి మొత్తం 33,29,489.58 ఎకరాల భూములకు రీ సర్వే జరగనుంది.
- ఒంగోలు రెవెన్యూ డివిజన్‌లో పట్టా భూములు 7,07,42.89 ఎకరాలు, ప్రభుత్వ భూములు 1,87,880.48 ఎకరాలు, సర్వే నంబర్‌ ఉన్న అటవీ భూములు 733.27 ఎకరాలు సర్వే నంబర్‌ లేని అటవీ భూములు 1917.56 ఎకరాలు ఉన్నాయి.

చంద్రబాబు చిక్కులు తెస్తే..
వైఎస్‌ జగన్‌ చక్కదిద్దారు

ఏళ్ల తరబడి రైతు కుటుంబాల్లో చీకట్లు నింపిన నిషేధిత భూముల సమస్యను సీఎం వైఎస్‌ జగన్‌ చక్కదిద్దారు. టీడీపీ జమానాలో 22(ఏ) జాబితాలోకి భూములు చేర్చడం వల్ల క్రయ విక్రయాలకు అవకాశం లేక, ప్రభుత్వ పథకాలు అందక, చివరికి విత్తనాలు, పురుగుమందుల సబ్సిడీలు కూడా దక్కక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ తరుణంలో భూముల హద్దులు పక్కాగా నిర్ణయించేలా రీ సర్వే చేస్తూనే, మరో పక్క నిషేధిత జాబితాలోని భూములకు మోక్షం కల్పించారు. జిల్లాలో 8,056 మంది రైతులకు సంబంధించి 9,371 ఎకరాల సర్వీస్‌ ఇనామ్‌ భూములు, 20 ఏళ్లకు పైబడిన ఫ్రీహోల్డ్‌ అసైన్‌మెంట్‌ భూములకు సంబంధించి 2,198 మంది రైతులకు చెందిన 4,156 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. అదేవిధంగా పెద్ద సంఖ్యలో 21,479 మంది రైతులకు సంబంధించి 37,615 ఎకరాల చుక్కల భూమికి క్లియరెన్స్‌ ఇచ్చారు. ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా భూములు పొందిన వారికి సంబంధించి 1,750 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములే కాకుండా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో ఇటీవల 838 మంది రైతులకు 954 ఎకరాల భూమిని కొత్తగా అసైన్డ్‌ చేసి పాస్‌పుస్తకాలు అందజేశారు.

బురిడీ చంద్రబాబు మాటలు నమ్మొద్దు



పోతవరం గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున



జనసేన నుంచి పార్టీలోకి వచ్చిన యువకులను ఆహ్వానిస్తున్న మంత్రి మేరుగు

- గడప గడపకు నాగార్జున కార్యక్రమంలో మంత్రి మేరుగు

నాగులుప్పలపాడు: నమ్ముకున్న ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రజలందరూ దీవించాలని బురిడీ చంద్రబాబు మాయలో పడ్డొద్దని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి మేరుగు నాగార్జున అన్నారు. గడప గడపకు నాగార్జున కార్యక్రమంలో భాగంగా శనివారం మట్టిగుంట, ఈదుమూడి, ముప్పాళ్ల మద్దిరాల, ఒమ్మెవరం, పోతవరం గ్రామాల్లో చేపట్టిన ఇంటింటికీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నాగార్జున మాట్లాడారు. తన ఎన్నికల హామీలో జగన్‌మోహన్‌ రెడ్డి ఏదైతే చెప్పాడో ఆ మాటను నెరవేర్చి అట్టడుగు వర్గాలకు కూడా సంక్షేమ ఫలాలు అందించి అందరికీ మంచి చేసిన నాయకుడి పాలనను తిరిగి మనందరం ఆశీర్వదించాలని కోరారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ జెండా మళ్లీ ఎగరాలని, దీనికి అనుగుణంగానే అందరం సమష్టి కృషితో పని చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వలంటీర్‌ వ్యవస్థను ఏర్పాటు చేసిన జగన్‌మోహన్‌ రెడ్డి పాలనపై నిరంతరం ఎల్లో మీడియా విషం కక్కుతూ ప్రజలకు మేలు చేస్తున్న వ్యవస్థలపై కూడా కుట్రలు పన్నడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల గ్రామంలో మాజీ సర్పంచ్‌ పులిపాటి శ్రీమాన్‌ తన అనుచరులతో కలిసి టీడీపీని వీడి మంత్రి నాగార్జున సమక్షంలో వైఎస్సార్‌ సీపీలో చేరారు. ఒమ్మెవరం గ్రామంలో జనసేన నుంచి యువకులు వైఎస్సార్‌ సీపీలో చేరారు. వీరందరికీ మంత్రి మేరుగు వైఎస్సార్‌ సీపీ జెండా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముందుగా అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ విగ్రహాలకు పూలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్‌ స్టేట్‌ చైర్మన్‌ కొమ్మూరి కనకారావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ దంపతులు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, యాదాల రత్నభారతి అశోక్, మండల కన్వీనర్‌ పోలవరపు శ్రీమన్నారాయణ, కూనం పూర్ణచంద్రరావు, ఎంపీటీసీ మున్నంగి రమ్య, సర్పంచ్‌లు పాలేరు అనీలా నాగేశ్వరరావు, శీలం రేణుక సురేష్, పోలినేని కోటేశ్వరరావు, జెట్టి శ్రీనివాసరావు, తగిరిస సుబ్బారావు, గండు వెంకట్రావు, హరిబాబు, నల్లూరి దానియేలు, నార్నె హరిబాబు, నల్లూరి సుబ్బారావు, చావల వెంకట్రావు, వీరనారాయణ, అంజయ్య, వెంకటేష్, అశోక్‌ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమాభివృద్ధి



బాలినేనికి గజమాలతో ఘన స్వాగతం పలుకుతున్న నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్‌: వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమం, అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. రూరల్‌ మండలంలోని కరవది, పాతపాడు, మండువారిపాలెం గ్రామాల్లో బాలినేని రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కరవది గ్రామంలో ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్‌ వాక కృష్ణారెడ్డి, నాయకులు, ప్రజలు బాలినేనికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బాలినేని మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలకు భూమిపట్టా ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణాలు చేపట్టామన్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లు, డొంక రోడ్డును మెటల్‌ రోడ్డుగా మార్పులు చేశామని చెప్పారు. కాలనీలో డ్రైనేజీలు, సచివాలయ భవన నిర్మాణాలు చేపట్టారన్నారు. నాడు-నేడు కింద జెడ్పీ హైస్కూల్లో జూనియర్‌ కాలేజీ ప్రారంభమైందని, పీహెచ్‌సీకి నూతన భవనాన్ని నిర్మించామని చెప్పారు.

ఒంగోలు నగరంలో 25 వేల గృహ పట్టాలు ఇచ్చామన్నారు. పోతురాజు కాలువ శుద్ధీకరణ పనులు, డంపింగ్‌ యార్డ్, హైటెన్షన్‌ వైర్ల స్థానంలో అండర్‌ గ్రౌండ్‌ కేబుల్‌ నిర్మాణం పూర్తయిందన్నారు. గ్రామ చెరువు పూడిక తీసి, వాకింగ్‌ ట్రాక్‌ నిర్మిస్తామని బాలినేని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ డీ కోటేశ్వరరావు, ఎంపీపీ మల్లిఖార్జునరెడ్డి, వైస్సార్‌ సీపీ ప్రెసిడెంట్‌ చుంచు రామకృష్ణ, సోమశేఖర్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, క్రాంతి, పాలపర్తి రమేష్, దార్ల బాబు, మిదశాల కృష్ణ, అంకారావు, ప్రసన్న రెడ్డి, శ్రీనివాస్‌ రెడ్డి, అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ రమేష్‌ బాబు, మాజీ సర్పంచ్‌లు రాఘవ, వెంకటేశ్వర్లు, చుండూరి రవి, మేడికొండ కోటేశ్వరరావు, లక్ష్మారెడ్డి, పెరకంసుబ్బారావు పాల్గొన్నారు.

జగన్‌ సీఎం అయితేనే మళ్లీ పథకాలు



మర్రిపూడి దళితవాడలో అభివాదం చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్‌



రేగలగడ్డలో మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ఘనస్వాగతం పలుకుతున్న మహిళలు

- పల్లెపల్లెకు సురేష్‌ సిద్ధం కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు సురేష్‌
- ప్రచారంలో అడుగడుగునా ఘనస్వాగతం పలుకుతున్న ప్రజలు

మర్రిపూడి: గత ప్రభుత్వంలో పచ్చ నేతలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, కానీ జగనన్న ప్రభుత్వంలో కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారని మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ అన్నారు. ఐదేళ్లలో 130 సార్లు బటన్‌ నొక్కి సంక్షేమ పథకాల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. జగనన్నను గెలిపించుకుని మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తేనే ఆ పథకాలన్నీ కొనసాగి మీ బిడ్డల భవిష్యత్‌ బాగుంటుందని చెప్పారు. మండలంలోని దుగ్గిరెడ్డిపాలెం, గంగపాలెం, రేగలగడ్డ, మర్రిపూడి, పొట్టిరెడ్డిపాలెం గ్రామాల్లో శనివారం మంత్రి 'పల్లె పల్లెకు సురేష్‌ సిద్ధం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌ సీపీ శ్రేణులు పూలమాలలు, డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో దోచుకో... దాచుకో... తినుకో అనడం తప్పా కొండపి నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఏమీలేదన్నారు. రాబోవు ఎన్నికల్లో ఎలాగైనా చంద్రబాబు గెలవాలని అలవిగాని హామీలు ఇస్తున్నారని విమర్శించారు. పొత్తు రాజకీయాలను రాష్ట్ర ప్రజలు నమ్మబోరని చెప్పారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, కొండపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గ రూపురేఖలు మార్చి అందరికీ అందుబాటులో ఉండి అన్నివిధాలా అభివృద్ధి చేసి చూపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ పల్లెర్ల నర్సింహారెడ్డి, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, బోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, బోద రమణారెడ్డి, బీవీ భాస్కర్‌రెడ్డి, పూనూరి సంజీవరెడ్డి, మాచేపల్లి నాగయ్య, పూనూరి వెంకటేశ్వరరెడ్డి, చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గొంటు శివారెడ్డి, వనిపెంట మల్లికార్జునరెడ్డి, అలికేపల్లి కోటేశ్వరరావు, అంబటి జయరామిరెడ్డి, కదిరి భాస్కర్, కొండ్రు ఇజ్రాయిల్, గురిజాల యోబు, గురిజాల చిన్నారి, కొండ్రు సాల్మన్, గండి జోసెఫ్‌ పాల్గొన్నారు.

పసలేని ప్రసంగాలతో బాబు షో

- ఊకదంపుడు ఉపన్యాసంతో చంద్రబాబు ఫ్లాప్‌షో
- సీఎంపై దూషణలతో ఆద్యంతం విషం కక్కిన బాబు
- విసుగెత్తి మధ్యలోనే వెనుదిరిగిన అద్దె జనం
- భారీగా తెలంగాణ మద్యం పంపిణీ
- తాగి తూగిన తెలుగు తమ్ముళ్లు



ఇతర ప్రాంతాల నుంచి ప్రజలను తరలించుకుని వచ్చిన బస్సులు



తాగేసిన తెలంగాణ మద్యం బాటిళ్లు

దర్శి: టీడీపీ అధినేత చంద్రబాబు దర్శి పట్టణంలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ఊకదంపుడు ఉపన్యాసంతో జనాలను విసుగెత్తించారు. ఉదయం 10 గంటలకు రావాల్సిన బాబు 12.30 గంటలకు దర్శికి చేరుకున్నారు. బాబు ప్రసంగం ఆద్యంతం సీఎం జగన్‌పై దూషణలతో విషంకక్కారు. చెప్పిందే చెప్పి ఒక్కో విషయాన్ని రెండు, మూడు సార్లు వల్లె వేయడంతో ఆపార్టీ కార్యకర్తలకే బోరు కొట్టి అక్కడి నుంచి జారుకోవడం మొదలు పెట్టారు. అరకొరగా వచ్చిన జనం కూడా మధ్యలోనే వెళ్లిపోతుండటంతో సీఎం జగన్‌ను సైకో అంటూ.. భూస్థాపితం చేయాలంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తిట్లదండకంతో ఓటర్లను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని ప్రయత్నించారు. గోదావరి–కృష్ణ నదులు అనుసంధానం చేసి నీళ్లిస్తానని 2014లో చెప్పిన మాటలే మళ్లీ చొప్పుకొచ్చారు. గత ఎన్నికలు అయిపోయాక దర్శిని కన్నెత్తి చూడని బాబు అప్పటి హామీలే మళ్లీ వల్లెవేశారు. దాదాపు అరగంటపాటు మాట్లాడిన బాబు తన పాలనలో జనాలకు చేసిన ఒక్క మంచి పనిని కూడా ప్రస్తావించలేదు. తన పాలనలో దొనకొండను ఇండస్ట్రియల్‌ హబ్‌గా ప్రకటించానన్న బాబు ఎన్ని కంపెనీలు తెచ్చిందీ చెప్పలేదు.

బాబు సభకు మహిళలు దూరం:

చంద్రబాబు సభలో మహిళలు పెద్దగా కనిపించకపోవడం గమనార్హం. అక్కడక్కడా ఉన్న వారు కూడా నీడ పట్టుకెళ్లి కూర్చున్నారే తప్ప చంద్రబాబును చూద్దామని ఒక్కరూ రాలేదు. ఒంగోలు, చిలకలూరిపేట, అద్దంకి, నరసరావు పేట నుంచి బస్సులు ఏర్పాటు చేసి డబ్బిచ్చి జనాలను తోలారు. మద్యం మత్తులో కార్యకర్తలు తాగి టీడీపీ జెండాలతో గోల చేశారు. మద్యం ఏరులై పారించారు. ఎక్కడ చూసినా చెట్ల కింద కూర్చుని మద్యం తాగుతున్న దృశ్యాలే. తెలుగు తమ్ముళ్ల కోసం తెలంగాణ నుంచి భారీగా మద్యం తీసుకొచ్చారు. బస్సుల్లో, లారీల్లో తెలంగాణ మద్యం విచ్చల విడిగా పంచారు. ఎన్నికలు అయిపోయే వరకు సరిపడా తెలంగాణ మద్యాన్ని టీడీపీ నేతలు స్టాకు పెట్టినట్లు ఆ పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు.

పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ పక్కాగా నిర్వహించాలి



పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

ఒంగోలు అర్బన్‌: సాధారణ ఎన్నికల్లో భాగంగా జరుగుతున్న పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ అధికారులను ఆదేశించారు. శనివారం ప్రారంభమైన పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ ప్రక్రియకు సంబంధించి డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్‌లో ఓటింగ్‌ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్‌ ఉండటం వల్ల ఓటర్లకు అవసరమైన తాగునీరు, టెంట్లు, కుర్చీలు, హెల్ప్‌డెస్క్‌ ఏర్పాటు తదితర అంశాల్లో ఎటువంటి లోటు లేకుండా చూడాలన్నారు. పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్, హోమ్‌ ఓటింగ్, ఈవీఎంల కమిషనింగ్‌ జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల స్థాయిలో జరుగుతున్నట్లు తెలిపారు. పొరుగు జిల్లాలో ఓటు ఉండి ప్రస్తుతం ప్రకాశంలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగుల కోసం జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఓటు వేసేలా ఫెసిలిటేషన్‌ సెంటర్‌ ఏర్పాటు చేశారన్నారు. కలెక్టర్‌తో పాటు ఒంగోలు రిటర్నింగ్‌ అధికారి సుబ్బారెడ్డి, ఓఎంసీ కమిషనర్‌ జస్వంతరావు ఉన్నారు.

నిజాయితీ ఉంటే రాజీనామా చేయాలి

- దమ్ముంటే మళ్లీ పోటీ చేసి గెలవాలి
- టీడీపీకి అమ్ముడుపోయిన కార్పొరేటర్లకు మేయర్ గంగాడ సుజాత సవాల్
- ఇలాంటి ప్రలోభాల వల్లే గత ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు గుణపాఠం చెప్పారని ధ్వజం
- ప్రస్తుతం దామచర్ల మళ్లీ అదే కొనసాగిస్తున్నాడని, ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపు
- తామంతా వైఎస్సార్ సీపీ జెండా, వాసన్న అండతోనే గెలిచామని, బాలినేని వెంటే ఉంటామని స్పష్టం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత, పక్కన డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీకి అమ్ముడుపోయి ఆ పార్టీలో చేరిన కార్పొరేటర్లకు నీతి, నిజాయితీ ఉంటే వెంటనే రాజీనామా చేసి మళ్లీ పోటీచేసి గెలవాలని నగర మేయర్ గంగాడ సుజాత సవాల్ విసిరారు. శనివారం సాయంత్రం స్థానిక బాలినేని నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు 23 మంది వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంతో ఆ పార్టీకి 2019 ఎన్నికల్లో ప్రజలు చెంపచెళ్లుమనిపించారన్నారు. కానీ, నేడు అదే బాటలో పయనిస్తూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను సంతలో పశువుల్లా రూ.20 లక్షలు వెచ్చించి కొనుగోలు చేయడం ద్వారా ప్రజానీకానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని మేయర్ ప్రశ్నించారు. టీడీపీకి సరైన గుణపాఠం చెప్పేందుకు ఇప్పటికే ప్రజానీకం సిద్ధంగా ఉన్నారన్నారు. తాజా పరిణామాలతో టీడీపీని జనం మరింత అసహ్యించుకుంటున్నారని అన్నారు. ఒక జెండాపై గెలిచి ఆ జెండాను పక్కనపెట్టి వ్యక్తిగత స్వార్థం కోసం ప్రలోభాలకు ఆశపడి మరో పార్టీలోకి మారడం అనేది నైతికత కాదన్నారు. పార్టీ మారిన వారు, పార్టీ మారేందుకు ప్రోత్సహించిన వారి చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి వైఖరిపై తమ పార్టీ సీరియస్‌గా ఉందని, తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పార్టీ మారిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నామన్నారు. మంచి జరిగితేనే తమకు ఓటు వేయమని చెబుతున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయనతో పాటు స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అండతోనే తామంతా కార్పొరేషన్ ఎన్నికల్లో గెలవడం జరిగిందని మేయర్ వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇంటి పట్టాలు ఇస్తే.. వాటిని దొంగ పట్టాలంటూ ప్రజల్లో అలజడి సృష్టించాలనే టీడీపీ యత్నాలు సాగకపోవడంతో చివరకు కార్పొరేటర్లను కొనుగోలు చేస్తూ కుయుక్తులకు టీడీపీ నాయకులు పాల్పడుతున్నారంటూ మండిపడ్డారు. తన ఊపిరి ఉన్నంత వరకు బాలినేని శ్రీనివాసరెడ్డి వెంటే ఉంటానని ఆమె స్పష్టం చేశారు.

మా వద్ద ఉన్నప్పుడు అవినీతి పరులు మీ వద్దకు వస్తే సచ్ఛీలురు అవుతారా..?

డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు మాట్లాడుతూ సంతలో పశువులను కొన్నట్లుగా కార్పొరేటర్లను కొనాలనుకోవడం అప్రజాస్వామికమని అన్నారు. ఇళ్ల పట్టాలు ఇవ్వడం సాధ్యపడదని టీడీపీ వారు సంబరపడ్డారని, కానీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పోరాడి మరీ రూ.230 కోట్లు తెప్పించి పేదల కల సాకారం చేశారని తెలిపారు. ఇది టీడీపీకి మింగుడుపడక తప్పుడు విధానాలకు పాల్పడుతోందన్నారు. పట్టాలు ఇవ్వడం మాత్రమే కాకుండా అక్కడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.75 కోట్లు, పైపులైన్ నిర్మాణానికి మరో రూ.50 కోట్లు వెరసి మరో రూ.125 కోట్లను కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారన్నారు. దీంతో టీడీపీకి పతనం తప్పదని అర్థమైందని, గతిలేక కార్పొరేటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, ప్రలోభాలకు గురిచేయడం ద్వారా టీడీపీలో చేర్చుకుంటున్నారని విమర్శించారు. తమ పార్టీలో ఉన్నప్పుడు కొంతమంది కార్పొరేటర్లు స్థలాలను కబ్జా చేశారంటూ సాక్షాత్తూ ఇదే టీడీపీ నాయకులు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారని, అదే విధంగా బినామీ రుణాలు పొందారంటూ తీవ్ర ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. కానీ, నేడు వారినే టీడీపీలోకి చేర్చుకోవడం ద్వారా వారు సచ్ఛీలురుగా మారారా అంటూ డిప్యూటీ మేయర్ ప్రశ్నించారు.

23వ డివిజన్ కార్పొరేటర్ ఇంతిజార్ మాట్లాడుతూ లక్షలు ఇస్తామంటూ కార్పొరేటర్లను ప్రలోభపెట్టడం సరికాదని, టీడీపీ నాయకులు ఇటువంటి వ్యవహారాలు మానుకోవాలని హితవు పలికారు. 14వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడుతూ పదిరోజుల క్రితం వాసన్నకు సంఘీభావం తెలిపి ఇప్పుడు పార్టీ మారడం ద్వారా మీ డివిజన్ ప్రజలకు మీరు ఏమని సమాధానం చెబుతారంటూ పార్టీ మారిన కార్పొరేటర్లను ప్రశ్నించారు. మన స్వాక్షిని చంపుకుని జీవించడం సరికాదని, ప్రలోభాలకు లొంగి జీవించడం తమ వల్ల కాదని అన్నారు. 50వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య మాట్లాడుతూ బాలినేని లాంటి గొప్ప నాయకుడిని భవిష్యత్తులో చూడలేమన్నారు. ప్రతి మీటింగ్‌లో తాను నిజాయితీపరుడ్ని అని చెప్పుకునే దామచర్ల జనార్దన్ ఇలాంటి నీతిమాలిన చర్యలకు ఎందుకు పాల్పడ్డారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి డివిజన్లలో అభివృద్ధి పనులు చేసి తామంతా మంచి పేరు సంపాదించుకున్నామని, అదే తమకు అలంకారం, ఆస్తి అని అన్నారు. 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు మాట్లాడుతూ తన రాజకీయ జీవితం వాసన్నతోనే సాగుతుందన్నారు. ఉంటే వాసన్న వెంట ఉంటానని, లేదంటే రాజకీయాలకు స్వస్తి పలుకుతానని అన్నారు. అంతే తప్ప మరో పార్టీ వైపు చూసే ప్రశ్నే లేదన్నారు. కేవలం తమను మనస్తాపానికి గురిచేయాలనే ఉద్దేశంతోనే టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తుందని, దానిని కార్పొరేటర్లమంతా సమిష్టిగా తిప్పికొడతామని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వాసన్న భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పసుపులేటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే నా నమ్మకం..నా ధైర్యం!

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నా రాంబాబు


మాట్లాడుతున్న అన్నా రాంబాబు, పక్కన జంకె, హనుమారెడ్డి

మార్కాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆదేశాల మేరకే ఆయన సేవకునిగా మార్కాపురం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, మీ ఆశీస్సులు అందించి ఈ నెల 13న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నా రాంబాబు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన మార్కాపురం మండలం బొందలపాడు పంచాయతీలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు వెన్న హనుమారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. తన బలం.. తన ధైర్యం.. జగనన్నేనని అన్నా రాంబాబు అన్నారు. మార్కాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వెన్న హనుమారెడ్డి స్వగ్రామం బొందలపాడు నుంచి తనకు ఎక్కువ మెజారిటీ వచ్చేలా అందరూ సహకరించాలని కోరారు. జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ఓటేస్తే కచ్చితంగా మంచి జరుగుతుందని, ఆ ఓటు ప్రజాస్వామ్యాన్ని కాపాడటంతో పాటు భావితరాల వారికి ఉపయోగపడుతుందన్నారు. గడిచిన ఐదేళ్లలో ఎటువంటి రికమెండేషన్ లేకుండా అన్నీ ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందాయనీ, మళ్లీ అవన్నీ కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించుకుందామని చెప్పారు. వెన్న హనుమారెడ్డి మాట్లాడుతూ బొందలపాడు వైఎస్సార్ సీపీకి పెట్టని కోటలాంటిదని, 13న జరిగే ఎన్నికల్లో గ్రామస్తులు ఐక్యంగా ఉండి వైఎస్సార్ సీపీకి ఓట్లు వేయాలని కోరారు. గ్రామంలో కార్యకర్తలు వీరికి ఘన స్వాగతం పలికారు. తర్లుపాడు జెడ్పీటీసీ వెన్న ఇందిర, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కంది ప్రమీలారెడ్డి, సర్పంచ్ తుమ్మా రమణమ్మ, తుమ్మా వెంకటేశ్వరరెడ్డి, లయోలా చెంచిరెడ్డి, చదలవాడ రమణారెడ్డి పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయాలి

- సార్వత్రిక ఎన్నికల జిల్లా పోలీస్ అబ్జర్వర్ హసీబ్ ఉర్ రెహమాన్


ఈతముక్కల హైస్కూల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న హసీబ్ ఉర్ రెహమాన్

కొత్తపట్నం: ఓటర్లు తమ ఓటును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని సార్వత్రిక ఎన్నికల జిల్లా పోలీస్ అబ్జర్వర్, ఐపీఎస్ హసీబ్ ఉర్ రెహమాన్ పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కొత్తపట్నం మండలంలో కొత్తపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కొత్తపట్నం రెడ్డిపాలెం, కె.పల్లెపాలెం, ఈతముక్కల పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు, భౌగోళిక పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలపై అధికారులతో ఆయన చర్చించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై పోలీస్ అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికలు పారదర్శకంగా సజావుగా జరగడానికి పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు, బారికేడింగ్, ఇతర ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ఓటరు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సిబ్బంది విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి భద్రతాపరమైన లోపాలు, అవరోధాలు ఉన్నా.. వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఎవరైనా ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని వివరించారు. తన ఫోన్ నంబర్ 9281034495కు సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఆయన వెంట కొత్తపట్నం ఎస్సై బి.సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ పూర్తి


ఈవీఎంల ఎఫ్ఎల్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్థానిక భాగ్యనగర్‌లోని ఈవీఎం గోదాములో ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి అదనంగా బెంగళూరు నుంచి వచ్చిన 2,408 బ్యాలెట్ యూనిట్లకు చేపట్టిన ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ)ను శనివారంతో పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్‌కు సిద్ధం చేశారు. కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ శ్రీలత, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా కొండపి నియోజకవర్గంలో ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం పరిశీలించారు. సింబల్స్ లోడింగ్, అవసరమైన చోట సీల్ వేస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. కొండపి నియోజకవర్గానికి ఈవీఎంలు ఈ కాలేజీ నుంచి పంపేలా స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేశామన్నారు.

రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

గిద్దలూరు రూరల్: రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని దిగువమెట్ట బొగదా రైలు మార్గం మధ్యలో జరిగినట్లు శనివారం నంద్యాల జీఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించారు. సుమారు 50 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి 3వ తేదీ కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రైలు పట్టాలకు దగ్గరగా పడి ఉండటంతో రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు పోలీసులు అంచనా వేశారు. మృతుడి సమాచారం తెలిసిన వారు 7893433861 సెల్ నంబర్‌ను సంప్రదించాలని నంద్యాల రైల్వే పోలీసులు సూచించారు.

రోడ్డు పక్కన గుర్తు తెలియని మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

పొదిలి: ఒంగోలు-నంద్యాల రహదారిలో కంభాలపాడు సచివాలయం సమీపంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని మృతదేహం పడిఉంది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఎస్సై కోటయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కోటయ్య తెలిపిన వివరాల మేరకు మృతుడు వయస్సు 50-55 ఏళ్లు ఉంటుందని, 5.4 అడుగుల ఎత్తు, బూడిద రంగు ప్యాంటు, తెలుపు బ్లూ కలర్ గీతలు కలిగిన చొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుని, వాటిని అమ్ముకుని జీవనం సాగించే వ్యక్తిలా ఉన్నాడని తెలిపారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు


బూచేపల్లి కుటుంబసభ్యులకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు


ప్రచార కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు

- మన ఊరికి మన శివన్న ఎన్నికల ప్రచారంలో డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి
- ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకి ఓటు అడిగే అర్హత లేదు
- రెడ్డినగర్, లక్ష్మీనగర్, పెద ఉల్లగల్లు, చిన ఉల్లగల్లు గ్రామాల్లో బ్రహ్మారథం

ముండ్లమూరు: జగనన్న పాలనలోనే అన్ని వర్గాలకు మేలు జరిగిందని వైఎస్సార్ సీపీ దర్శి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని రెడ్డినగర్, లక్ష్మీనగర్, పెద ఉల్లగల్లు, చిన ఉల్లగల్లు గ్రామాల్లో శనివారం రాత్రి మన ఊరికి మన శివన్న ఎన్నికల ప్రచారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సతీమణి నందినిలతో కలిసి నిర్వహించారు. బూచేపల్లి కుటుంబ సభ్యులకు మహిళలు దిష్టి తీస్తూ.. పూలు చల్లుతూ... హారతులతో స్వాగతం పలుకగా నాయకులు, అభిమానులు గజమాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని కులాలకు సమన్యాయం చేయాలనే లక్ష్యంతో ఈబీసీ నేస్తం, కాపు నేస్తం పథకాలను ప్రవేశపెట్టి ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల ముందు రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి, మరో 600 వందల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించి ప్రజలను మోసం చేశాడని మండిపడ్డారు. అమలు కానీ హామీలతో చంద్రబాబుకు ఓటు అడిగే హక్కులేదన్నారు. కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి ఆత్మగౌరవం కాపాడిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. నవరత్నాలతో పేదలకు, రైతులకు, మహిళలకు అండగా నిలిచిన జగనన్న రుణం తీర్చుకోలేనిదన్నారు. దేశంలో ఎన్నికల హామీలు వందశాతం అమలు చేసిన ఏకైక సీఎం మన జగనన్నే అన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఆరాధ్య దైవమైన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఓటమి భయంతో ప్రతిపక్షాలు ఏకమైన కూటమి అభ్యర్థులను ఓటుతో భూస్థాపితం చేసేందుకే ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు చేసిన మోసాలను ప్రజలు మరిచిపోవద్దన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా సమాజంలో గౌరవంగా తలెత్తుకొని తిరిగేలా యాభై శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా మీ బ్యాంకు ఖాతాల్లో చేరాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడం చారిత్రక అవసరమన్నారు. బూచేపల్లి కుటుంబానికి కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా సేవ చేయడమే తెలుసన్నారు. నా కుమారుడు శివపై చూపే మీ ప్రేమాభిమానాలు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా శివప్రసాదరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రచారంలో మహిళలు బూచేపల్లి కుటుంబ సభ్యులకు వీర తిలకం దిద్దుతూ, డప్పుల వాయిద్యాలు, హారతులతో అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధాన నాయకులు అన్నపురెడ్డి భిక్షాలురెడ్డి, వాతల రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చినమాలకొండారెడ్డి, జక్కం రాజా, నరసింహారెడ్డి, జిల్లెలమూడి శివయ్య, మదమంచి శ్రీను, జిల్లెలమూడి పున్నయ్య, తప్పెట డేవిడ్, నాగరాజు, పి జాన్‌డేవిడ్, రామమోహన రెడ్డి, మాజీ సర్పంచ్ గొంది వెంకటప్పారెడ్డి, సర్పంచ్ జనమాల నాగేంద్రంపిచ్చయ్య, ఎంపీటీసీ గుణపాటి వెంకటేశ్వరరెడ్డి, రాఘవరెడ్డి,ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీలు బంకా రమణమ్మనాగిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ మేడికొండ జయంతి, మండల మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, సర్పంచ్‌ల సంఘ మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, రెడ్డి సంఘ జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మితే నట్టేట మునిగినట్లే

- గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

బేస్తవారిపేట: ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, ఆయన్ను నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచేస్తాడని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని హనుమాయపల్లె, బాలేశ్వరపురం, బార్లకుంట, చెన్నుపల్లె, అక్కపల్లె, జెన్నివారిపల్లె, చెరుకుపల్లె, గంటాపురం, కొత్తపేట గ్రామాల్లో ఆయన ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి 600పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా, ఎన్నికల మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి కనపడకుండ చేశారని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం పాలన అందిస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక విష ప్రచారం చేస్తున్నాయన్నారు. చంద్రబాబు హయాంలో చేసిన లక్షల కోట్ల అప్పులు ఏ ఒక్కరికి పథకాలు అందించకుండా ఏమీ చేశారో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించి మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్నను గెలిపించుకుంటేనే ప్రజలకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. సీఎం జగనన్న మేనిఫెస్టోలో పెట్టకపోయినా అనేక పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. అవినీతి లేకుండా మంచి చేసిన పార్టీని ఎన్నుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. గ్రామాల్లో ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు శాలువా, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఎంపీటీసీ సభ్యులు చిలకల బాలరంగారెడ్డి, కె.సురేష్, బండి నాగరత్నమ్మ, పి.నారాయణ, మాజీ ఎంపీటీసీ దప్పిలి సంభూతరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కొండా వెంకటరెడ్డి, బి.రమణారెడ్డి, సుబ్బారెడ్డి, ఎం.బోడెయ్య, నాయకులు కొండా లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బనాయుడు, బ్రహ్మనాయుడు, అంకిత ప్రసాద్, తిరుమలయ్య, పేరూరి గురవయ్య, చాగని వెంకటరెడ్డి, సుబ్బరాయుడు, సుబ్బయ్య, బండి చెన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, హరిబాబు, మద్దుల హరికృష్ణారెడ్డి, మార్తాల నారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, కత్తి చిన్నన్న పాల్గొన్నారు.

రూ.1.10 లక్షల నగదు సీజ్


స్వాధీనం చేసుకున్న నగదుతో ఎస్సై మధుసూదనరావు

కొమరోలు: ఎన్నికల నేపథ్యంలో కొమరోలు మండలంలోని అల్లినగరం చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.1.10 లక్షల నగదు పట్టుబడగా సీజ్ చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. వినుకొండ నుంచి మైదుకూరు వెళ్తున్న ఓ వాహనంలో నగదు దొరికినట్లు వెల్లడించారు. కె.సైదులు అనే వ్యక్తి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల కమిషన్‌కు అందజేస్తామని ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.



నమ్మక ద్రోహం, అవినీతికి చొక్కా, ప్యాంటు వేస్తే సాక్షాత్కరించే రూపం ముత్తుముల అశోక్‌రెడ్డి. వైఎస్సార్ సీపీ నుంచి గెలుపొంది 'నారా కాంపౌండ్' వాచ్ డాగ్స్ విసిరిన బిస్కెట్లను చెవులూపుతూ వెళ్లి ఆరగించిన ఈ 'పెద్ద మనిషి'.. ఓటు వేసిన ప్రజల నమ్మకాన్ని చంద్రబాబు కాళ్ల వద్ద తాకట్టు పెట్టి తన నిజ స్వరూపాన్ని బయటపెట్టాడు. రూ.కోట్లు కూడబెట్టాలన్న అత్యాశతో టీడీపీలోకి ఫిరాయించి అక్రమాల దందాకు తెరలేపాడు. అధికారమే అండగా అనుచరులతో కలిసి ప్రజా ధనాన్ని కొల్లగొట్టి 'కమీషన్ కింగ్, వసూల్ రాజా' బిరుదులు సొంతం చేసుకున్నాడు.

అశోకవనంలో అవినీతి మేట

టీడీపీ జమానాలో అధికారమే అండగా 'ముత్తుముల' దందా

- పనుల్లో పర్సెంటేజీ కోసం కాంట్రాక్టర్లకు బెదిరింపులు
- కమీషన్లు దండుకుని అనుచర గణానికి వర్క్ ఆర్డర్లు
- అశోక్‌రెడ్డికి ప్రజా సేవ కన్నా దోపిడీ యావే ఎక్కువని విమర్శలు

బేస్తవారిపేట: 'ప్రతి పనికి ఓ రేటు.. బేరం కుదిరితే కమీషన్ కొట్టు..' ఇది టీడీపీ జమానాలో 'ముత్తుముల' అవలంబించిన సిద్ధాంతం. 2014–19 మధ్య అధికార మదం.. అడిగేవాడు లేడన్న బరితెగింపు ధోరణితో గిద్దలూరు



నాడు : కంభంలో ప్రారంభానికి ముందే శిథిలమైన చెత్త నుంచి సంపద కేంద్రం(ఫైల్)

నియోజకవర్గంలో అశోక్ అండ్ కో అవినీతి దందాతో చెలరేగిపోయారు. కరువు ప్రాంతమైన గిద్దలూరు నియోజకవర్గంలో చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటల నిర్మాణం మాటున రూ.కోట్లు కొల్లగొట్టారు. సీసీ రోడ్ల నిధులను పక్కదోవ పట్టించడంతోపాటు పేదల మరుగుదొడ్ల నిధులను సైతం దిగమింగారు. కమీషన్ ఇవ్వని కాంట్రాక్టర్లను బెదిరించి దారికి తెచ్చుకోవడం అప్పట్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. ప్రజా సేవ కన్నా జనం సొమ్ము దోపిడీ చేయాలనే యావే అశోక్‌లో అధికంగా ఉందని గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

నీరు–చెట్టు.. పనులు చేస్తే ఒట్టు

టీడీపీ జమానాలో చేపట్టిన 'నీరు–చెట్టు' పథకం ఆ పార్టీ నేతలకు కాసుల వర్షం కురిపించింది. ఉపాధి హామీ కూలీలు చేయాల్సిన పనులను అడ్డగోలుగా జేసీబీలు, పొక్లెయిన్లతో చేపట్టి అందినకాడికి దోచుకున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో నీరు–చెట్టు కింద 318 పనులకుగాను రూ.18.84 కోట్లు మంజూరు కాగా సుమారు రూ.14 కోట్లు టీడీపీ నేతల జేబుల్లోకే చేరాయి. గిద్దలూరు, కొమరోలు మండలాల్లో నీరు–చెట్టు పనులను ఎమ్మెల్యేగా ఉన్న అశోక్‌రెడ్డి తన బినామీలతో చేయించడం టీడీపీ నేతలకే కన్నుకుట్టింది. వాగుల్లో పూడికతీత కోసం మంజూరైన పనుల్లో 20 శాతం మాత్రమే చేసి అప్పనంగా నిధులు నొక్కేశారు. గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సాగునీటి చెరువుల మరమ్మతుల కోసం ప్రపంచ బ్యాంక్ నిధులు రూ.17 కోట్లు మంజూరు కాగా పర్సెంటేజీలు దండుకుని తూతూ మంత్రంగా పనులు చేశారు.



పూసలపాడులో వద్ద కొట్టుకుపోయిన చెక్ డ్యామ్



శీలం వెంకటాంపల్లె వద్ద మూడు పర్యాయాలు బిల్లు తీసుకున్న కుంట

అశోక్ అండ్ కో అవినీతి చిట్టా..



రాచర్ల : ఒక్క వర్షానికే కొట్టుకుపోయిన లోతువాగులో నిర్మించిన చెక్ డ్యామ్

- ఉపాధి హామీ పథకంలో భాగంగా నియోజకవర్గంలో మెటల్, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించగా అశోక్‌రెడ్డి బినామీలు, అనుచరులు గద్దల్లా వాలిపోయారు. గోవిందాపురం, యర్రబాలెం, బార్లకుంట, అయ్యవారిపల్లెలో చేపట్టిన బీటీ రోడ్ల పనుల్లో రూ.1.20 కోట్లు కమీషన్ అశోక్‌రెడ్డి గల్లా పెట్టెకే చేరాయన్న ఆరోపణలున్నాయి. నాసిరకంగా నిర్మించిన ఈ రోడ్లన్నీ కొద్ది రోజులకే గోతులమయమయ్యాయి.
- గిద్దలూరు–జేజికేపురం మధ్య రైల్వే అండర్‌పాస్ వర్క్ కాంట్రాక్టర్‌ను ముత్తుముల సోదరుడు బెదిరించి రూ.30 లక్షలు గుంజడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది.
- నియోజకవర్గంలో 181 చెక్‌డ్యామ్‌లు నిర్మించేందుకు రూ.16.57 కోట్లు కేటాయించారు. వీటిలో ఎక్కువ శాతం చెక్‌డ్యామ్‌లు ప్రజలకు ఉపయోగం లేని చోట నిర్మించడం గమనార్హం. ఒక్కసారి కురిసిన భారీ వర్షానికే నగానికి పైగా చెక్‌డ్యామ్‌లు కొట్టుకుపోయి టీడీపీ నేతల అవినీతి దందాను బట్టబయలు చేశాయి. చెక్‌డ్యామ్‌ల పనులను గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలకు నామినేషన్ పద్ధతిపై కేటాయించగా 10 నుంచి 15 శాతం వరకు కమీషన్ పుచ్చుకుని కాంట్రాక్టర్లకు కట్టబెట్టడం, వారు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడంతో పెద్ద మొత్తం ప్రజా ధనం వృథా అయింది.
- ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకంలో అశోక్‌రెడ్డి బినామీలు, అనుచరులకే చోటుదక్కింది. మొక్కలు నాటకపోయినా నాటినట్లు రికార్డులు సృష్టించి కోట్లాది రూపాయల ఉపాధి హామీ నిధులు బొక్కేశారు.
- వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనుల్లోనూ అవినీతి రాజ్యమేలింది. టీడీపీ నేతలే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి ముత్తుములకు ముడుపులిచ్చి మరీ పనులు దక్కించుకున్నారు. మరుగుదొడ్లు నిర్మించకుండానే బిల్లులు స్వాహా చేశారని 2018–19 మధ్య బీజేపీ నేతలు ధర్నాలు చేశారు.



- హెరిటేజ్ కోసం ఒంగోలు డెయిరీని బొందపెట్టిన బాబు
- బూటకపు హామీలను కొత్తగా వల్లె వేస్తున్న నారాసురుడు

జిల్లాలో సహకార వ్యవస్థను చంద్రబాబు ప్రభుత్వం దారుణంగా దెబ్బతీసింది. బాబు ఐదేళ్ల పాలనలో సహకార వ్యవస్థలో ఉన్న ప్రధానమైన సంస్థలన్నీ మూతపడే స్థితికి చేరాయి. చిత్తూరు డెయిరీని చిదిమేసినట్టుగానే.. ఒంగోలు డెయిరీ గొంతు నులిమిన చంద్రబాబు తన సొంత సంస్థ హెరిటేజ్ పాల వ్యాపారాన్ని అమాంతం పెంచుకున్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పరిస్థితి బాబు జమానాలో అత్యంత దయనీయం. గ్రామీణాభివృద్ధికి దోహదపడాల్సిన సహకార సంఘాలను టీడీపీ నాయకులు వారి వ్యాపార, ఆర్థిక ప్రయోజనాల కోసం నాశనం చేయడం అందరికీ తెలిసిన నిజం..

– సాక్షి, ప్రకాశం డెస్క్

వ్యవస్థల విధ్వంసం

అవినీతి కోడె నాగు పడగ నీడలో కుదేలైన సహకార వ్యవస్థలు

హెరిటేజ్ పుట్టలోకి ఒంగోలు డెయిరీ పాలు

2014లో గద్దెనెక్కిన చంద్రబాబు తన ధర్మాన్ని మరిచి ఏటా రెండున్నర కోట్ల లీటర్ల పాలు సేకరించే ఒంగోలు డెయిరీ ఆర్థిక మూలాలపై గొడ్డలి వేటు వేశారు. 15 ఏళ్లుగా డెయిరీలో పాతుకుపోయిన పాలక మండలి మొత్తం తన తొత్తులే కావడంతో చంద్రబాబు వక్ర ఆలోచనలను ఆచరణలో పెట్టి హెరిటేజ్ ఎదుగుదలకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. సహకార రంగంలో ఉన్న డెయిరీని కంపెనీ చట్టంలోకి మార్చి, 104 ఎకరాల డెయిరీ భూములు, మిషనరీని తాకట్టు పెట్టి ఆ సొమ్మును పప్పూబెల్లంలా పంచుకుతిన్నారు. జిల్లాలోని 35 వేల పాడి రైతులను పథకం ప్రకారం హెరిటేజ్‌లోకి మారేలా చేసి డెయిరీని మూతపడేలా చేశారు.

పీడీసీసీబీ, డీసీఎంఎస్ నష్టాలు చంద్రన్న కానుకే..

బాబు జమానాలో ప్రకాశం జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్(పీడీసీసీబీ) పరిధిలో 169 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను ఉత్సవ విగ్రహాల్లా మార్చారు. బాబు ఐదేళ్ల పాలనలో వర్షాలు లేక కరువుతో అల్లాడుతున్నా కనీసం ఆరుతడి పంటలకు కూడా పంట రుణాలు ఇచ్చే పరిస్థితి పీడీసీసీ బ్యాంకుకు లేదు. 2004కు ముందు చంద్రబాబు పదేళ్ల అధికారం వెలగబెట్టిన సమయంలో ప్రభుత్వ హామీతో ఇంకొల్లు స్పిన్నింగ్ మిల్లుకు కోట్లాది రూపాయలు అప్పుగా ఇప్పించింది. ఆ స్పిన్నింగ్ మిల్ బాబు జమానాలోనే మూత పడింది. చంద్రబాబు నిర్లక్ష్య వైఖరితో పీడీసీసీబీకి రూ.11 కోట్లు చిల్లు పడింది. పీడీసీసీ బ్యాంక్ పాలక మండలి మాజీ చైర్మన్ తన కుటుంబ సభ్యుల పేరుతో, తారక రామ డెయిరీ పేరుతో రూ.4 కోట్లు రుణం తీసుకోగా వడ్డీతో కలిపి రూ.7 కోట్లు అయింది. బ్యాంకులో నకిలీ ఆభరణాలు పెట్టి రూ.2.50 కోట్లు రుణంగా తీసుకున్నారు. ఇలా పీడీసీసీబీని దారుణంగా దెబ్బ కొట్టారు.

డెయిరీని ఆదుకున్న సీఎం వైఎస్ జగన్

ఒంగోలు డెయిరీ అన్ని రకాల బకాయిలు చెల్లించాలంటే రూ.109 కోట్లు అవసరమని 2020 డిసెంబర్‌లో ఏపీడీడీసీఎఫ్ ఎండీ రాసిన లేఖపై స్పందించిన సీఎం వైఎస్ జగన్ తక్షణమే రూ.69 కోట్లు విడుదల చేసి ఆదుకున్నారు. డెయిరీలో రెగ్యులర్ ఉద్యోగులుగా ఉన్న దాదాపు 100 మందికి వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీం(వీఆర్‌ఎస్) వర్తింపజేశారు. వారికి అన్ని రకాల ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం అదనంగా రూ.12.26 కోట్లు విడుదల చేశారు. పాల సేకరణలో ప్రసిద్ధిగాంచిన ''అమూల్'' డెయిరీని రంగంలోకి దించి పశుపోషకులకు అండగా నిలిచారు.

జగన్ పాలనలో పెరిగిన రైతుల పరపతి

2019లో వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే పంట రుణాల స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచారు. పీడీసీసీబీ ఆధ్వర్యంలో నాబార్డు, లీడ్ బ్యాంకు, ప్రధాన బ్యాంకర్లు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌డీసీ) సమావేశమై వాస్తవ పరిస్థితులపై చర్చించి రుణ పరిమితి ప్రతిపాదనలు తయారు చేసి రాష్ట్ర సాంకేతిక కమిటీ (ఎస్‌ఎల్‌టీసీ)కి పంపించి ఖరారు చేయడం ఆనవాయితీగా వస్తోంది.



టీడీపీ జమానాలో డెయిరీలో అవినీతిపై సీబీఐ విచారణ కోరుతూ ధర్నా చేస్తున్న రైతులు(ఫైల్)

ప్రధాన పంట గరిష్ట రుణ పరిమితి ఇలా..

పంట రకం	2024లో (ఎకరానికి)	2018లో (ఎకరానికి)
వరి	రూ.43 వేలు	రూ.25 వేలు
వేరుశనగ	రూ.38 వేలు	రూ.18 వేలు
జొన్న	రూ.25 వేలు	రూ.12 వేలు
మొక్కజొన్న	రూ.33 వేలు	రూ.16 వేలు
కంది	రూ.20 వేలు	రూ.12 వేలు
శనగ	రూ.34 వేలు	రూ.20 వేలు
పత్తి	రూ.42 వేలు	రూ.31 వేలు
పచ్చిమిరప	రూ.76 వేలు	రూ.49 వేలు
ఎండు మిరప	రూ.1 లక్ష	రూ.66 వేలు
మల్బరీ	రూ.1.05 లక్షలు	రూ.55 వేలు
టమాట	రూ.90 వేలు	రూ.55 వేలు
ఉల్లి	రూ.44 వేలు	రూ.30 వేలు
కరివేపాకు	రూ.47 వేలు	రూ.35 వేలు
అరటి	రూ.1.20 లక్షలు	రూ.55 వేలు
దానిమ్మ	రూ.97 వేలు	రూ.56 వేలు
కర్బూజా	రూ.55 వేలు	రూ.35 వేలు
ద్రాక్ష	రూ.లక్ష	రూ.80 వేలు
మామిడి	రూ.38 వేలు	రూ.25 వేలు
చెరకు	రూ.45 వేలు	రూ.38 వేలు

దర్శి: సాగర్ పరివాహక ప్రాంతమైన దర్శి నియోజకవర్గం అభివృద్ధి పథంలో పురోగమిస్తోంది. రైతు సంక్షేమానికి, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యలు నియోజకవర్గంలో వివిధ వర్గాల అభ్యున్నతికి దోహదపడ్డాయి. సచివాలయ వ్యవస్థతో గడప వద్దకే వచ్చిన పాలన, నాడు–నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు, గ్రామాల్లో మెరుగుపడిన మౌలిక వసతులు నియోజకవర్గ అభివృద్ధికి సూచికలుగా నిలుస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు కుటుంబాలపై ఆర్థికభారం తగ్గిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సరికొత్తగా దర్శనమిస్తున్న దర్శి మోడల్ స్కూల్

- నాడు–నేడుతో కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు
- ఆర్బీకేలతో అన్నదాతలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్
- సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో మెరుగైన సేవలు
- వ్యవసాయ, గృహ విద్యుత్ అవసరాలు తీర్చేందుకు చర్యలు
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు రూ.2 వేల కోట్లు

పల్లెలకు కొత్త రూపు.. అభివృద్ధిలో ఊపు

దర్శి నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు

మెరుగ్గా విద్యుత్ సరఫరా

నియోజకవర్గంలో విద్యుత్ అవసరాలకు ప్రభుత్వం రూ.52.15 కోట్లు వెచ్చించింది. కురిచేడు, అవులమండలలోని సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లకు రూ.కోటి, నియోజకవర్గంలో లో ఓల్టేజీ సమస్యలు తీర్చేందుకు రూ.2 కోట్లుతో 80 ట్రాన్స్‌ఫార్మర్లు, డ్యామేజీ పోల్స్‌కు రూ.1.10 కోట్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద 310 ఎంసీసీబీ బాక్సులకు రూ.95 లక్షలు, సబ్ స్టేషన్లలో బ్రేకర్‌లు, డ్యామేజీ ఎక్విప్‌మెంట్‌కు రూ.2.10 కోట్లు, వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు రూ.40 లక్షలు, 20 కిలోమీటర్ల మేర నూతన లైన్లు, కేబుల్‌ల మరమ్మతులకు రూ.70 లక్షలు, 11 కేవీ నూతన లైన్లు, మరమ్మతులకు రూ.30లక్షలు, నూతనంగా ముండ్లమూరు మండలం పెద్ద ఉల్లగల్లు, కురిచేడు మండలం కల్లూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ.4 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



దొనకొండ మండలం వెంకటాపురంలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్

దర్శి నియోజకవర్గంలో సంక్షేమ లబ్ధి వివరాలు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	34,520	253.503
జగనన్న అమ్మఒడి	24,016	83.655
అమ్మఒడి(అదర్స్)	8276	12.806
వైఎస్సార్‌చేయూత	10864	15.974
వైఎస్సార్ ఆసరా	27916	68.814
వైఎస్సార్ రైతు భరోసా	34344	123.358
ఇంటి నిర్మాణానికి (నేరుగా చెల్లింపు)	2,242	23.9691
సున్నా వడ్డీ(ఏఏ)	8964	15.208
కాపునేస్తం	921	13.365
ఉచిత పంటల బీమా	577	4.701
జగనన్న విద్యాదీవెన	12880	44.361
జగనన్న వసతి దీవెన	10,431	23.768
ఇన్‌పుట్ సబ్సిడీ	4,589	14.530
వాహనమిత్ర	1,227	11.565
సున్నా వడ్డీ పంట రుణాలు	7,384	16.311
జగనన్న చేదోడు	1,245	12.764
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	7,877	27.328
తెల్లరేషన్ కార్డుదారులకు కోవిడ్ సాయం	39,864	44.271
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	6,431	3.392
మత్స్యకార భరోసా	17	10.959
అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లకు సాయం	496	14.749
నాన్ డీబీటీ పథకాల లబ్ధి		
జగనన్న తోడు	2,295	2.295
సంపూర్ణ పోషణ	4,625	14.268
జగనన్న గోరు ముద్ద	20,854	11.972
జగనన్న విద్యా కానుక	21,562	11.596



బొట్లపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న పాల వెల్లువ కేంద్రం



దర్శిలో రైతు భరోసా కేంద్రం

గ్రామ స్వరాజ్యం దిశగా..

- నియోజకవర్గంలోని 334 పాఠశాలల్లో నాడు–నేడుకు ఎంపికైనవి 231
- ఫేజ్–1, ఫేజ్–2 కింద కేటాయించిన రూ.92.67 కోట్లలో ఇప్పటి వరకు చేసిన ఖర్చు రూ.51 కోట్లు.
- రూ.29.45 కోట్లతో 74 గ్రామ సచివాలయాలు, 5 వార్డు సచివాలయాలు నిర్మాణాలు పూర్తి
- రూ.17.22 కోట్లతో 79 రైతు భరోసా కేంద్రాల నిర్మాణం పూర్తి
- పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు 63 బల్క్ మిల్క్ సెంటర్లు మంజూరు.
- రూ.12.29 కోట్లు కేటాయించగా ఇప్పటి వరకు రూ.5.58 కోట్లతో 30 వరకు భవనాలు పూర్తి
- 30 వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలకు కేటాయించింది రూ.4.80 కోట్లు. దర్శి మండలం కొత్తపల్లి గ్రామంలో మొదటి డిజిటల్ లైబ్రరీ రూ.12.50 లక్షలు వెచ్చించి నిర్మాణం పూర్తి చేశారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.



కురిచేడులో ప్రధాన వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

సీసీ రోడ్లకు రూ.41.74 కోట్లు

నియోజకవర్గంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లకు సంబంధించి 527 పనులకుగాను రూ.41.74 కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తి చేశారు. 2019–20వ ఆర్థిక సంవత్సరంలో 411 పనులకు రూ.35.35 కోట్లు, 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.6.39 కోట్లు వెచ్చించారు.



ముండ్లమూరు మండలం పెద్ద ఉల్లగల్లు గ్రామంలో గ్రామ సచివాలయం

ప్రజారోగ్యానికి పెద్దపీట

దర్శి సీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా మార్చి రూ.3 కోట్లతో నూతన భవనాలు, అభివృద్ధి పనులు చేపట్టారు. నియోజకవర్గంలో 71 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.12.42 కోట్లు కేటాయించింది. అందులో భాగంగా రూ.5.86 కోట్లు ఖర్చు చేసి భవనాలు నిర్మించారు. మిగిలిన పనులు కొనసాగుతున్నాయి.



తాళ్లూరు మండలం బొద్దికూరపాడులో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్



దర్శి మండలం కొత్తపల్లిలో వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ

జన గళం

చట్ట సభల్లో మైనారిటీలకు సముచిత స్థానం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మైనారిటీలకు న్యాయం జరిగింది. సీఎం వైఎస్ జగన్ చట్టసభల్లో ముస్లింలకు సముచిత స్థానం కల్పించారు. మైనారిటీ ఎమ్మెల్యేను ఉప ముఖ్యమంత్రిని చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 7 ఎమ్మెల్యే సీట్లు కేటాయించగా టీడీపీ మూడు సీట్లే ఇచ్చింది.

– ఎండీ గఫార్ అలీఖాన్, కరస్పాండెంట్, ఎంజీ బీఈడీ కళాశాల, కంభం

ముస్లింలంతా జగన్ వెంటే..



వైఎస్సార్ ప్రవేశపెట్టిన 4 శాతం రిజర్వేషన్ వల్ల ఎంతో మంది పేద ముస్లిం విద్యార్థులు ఎంబీబీఎస్, ఇంజినీరింగ్, ఇతర ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. షాదీ తోఫా, మౌజన్, ఇమామ్‌లకు గౌరవ వేతనం ఇచ్చి సీఎం వైఎస్ జగన్ జగన్ అండగా నిలిచారు. ముస్లింల రిజర్వేషన్ రద్దు చేస్తామని చెబుతున్న బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీకి రాబోయే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతాం.

– మహమ్మద్ ఇబ్రహీం, రిటైర్డ్ టీచర్

ముస్లింల వంచకుడు చంద్రబాబు



టీడీపీ అధికారంలో ఉన్న ముస్లింలకు ఎటువంటి లబ్ధి చేకూరలేదు. హామీల అమలుపై ప్రశ్నించిన మైనారిటీ యువకులపై కేసులు పెట్టి వేధించారు. జగనన్న పాలనలో మౌజమ్‌ల గౌవర వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.5 వేలకు, ఇమామ్‌లకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచి ఆదుకున్నారు. షాదీతోఫాను రూ.లక్షకు పెంచి అండగా ఉన్నారు. టీడీపీకి ముస్లింలు ఓటు వేస్తే రిజర్వేషన్ రద్దుకు అంగీకరించినట్టే. బీజేపీతో కలిసి కుట్రలు చేసే పార్టీలకు ముస్లింలంతా ఓటుతో బుద్ధి చెప్పాలి.

– షేక్ ఖాజా హుస్సేన్, కంభం

బాబే పెద్ద భూచోడు



వందేళ్ల తర్వాత రాష్ట్రంలో భూముల సర్వే జరుగుతోంది. రూ.3 వేల కోట్లకు ఖర్చుతో బృహత్తర కార్యక్రమం చేపట్టిన సీఎం వైఎస్ జగన్ బొమ్మలు ఎక్కడా వేయకూడదనే హక్కు టీడీపీ వాళ్లకు ఎక్కడిది? పండగ సరుకులపైనే నీచంగా బొమ్మలు వేసుకుని ప్రచారం చేసుకోవచ్చు కానీ చరిత్రలో నిలిచిపోయే కార్యక్రమం గురించి ఎక్కడా ఆనవాళ్లు ఉండకూడదంటే ఎలా? సీఎం వైఎస్ జగన్ పాలనలోనే వేల మంది రైతులకు భూ హక్కులు వచ్చాయి. రీసర్వేతో సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని నమ్ముతున్నాం. పేదలకు రాజధానిలో సెంటు భూమి ఇస్తే ఓర్చుకోలేని కుళ్లోన్మాదులు ప్రజల భూముల గురించి నీతి వాక్యాలు చెబితే నమ్మేవాళ్లు ఎవరూ లేరు.

– ఎద్దు నగేష్